www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 17 జనవరి 2025
5
చిత్తూరు

నేటి నుంచి కానిస్టేబుల్ ఎంపిక ప్రక్రియ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: శుక్రవారం నుండీ రెండు రోజుల పాటు కానిస్టేబుళ్ళ ఎంపిక ప్రక్రియలో అభ్యర్థులకు దేహ దారుడ్య, సామర్థ్య పరీక్షలు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సిసి కెమెరాల నిఘా వలయంలో పగడ్బందీగా అభ్యర్థులకు దేహదారుడ్య, సామర్థ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 8, 9వ తేదీల్లో జరగాల్సిన పరీక్షలను వైకుంఠ ఏకాదశి కారణంగా వాయిదా వేయడం జరిగిందన్నారు. స్టైఫండరీ కేడెట్ ట్రైనీ పోలీసు కానిస్టేబుళ్ల (సివిల్, ఎ.పి.ఎస్.పి) దేహ దారుడ్య, సామర్థ్య పరీక్షలు చిత్తూరు ఉమ్మడి జిలా (చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య) పోలీసు ట్రైనింగ్ సెంటర్ మైదానంలో రేపటి నుండి రెండు రోజుల పాటు అంటే 17,18వ తేదీలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భర్తీ ప్రక్రియ పూర్తి పారదర్శంగా నిర్వహింస్తున్నట్లు చెప్పారు. ఎవరైనా మోసం చేసేందుకు ప్రయత్నిస్తే డయల్ 112 కు గాని లేదా 94409 00005 కు ఫిర్యాదు చేయాలని కోరారు.

హెల్మెట్ తప్పనిసరి..

విస్తృతంగా అవగాహనా కార్యక్రమాలు
రోడ్డు భద్రతా మాసోత్సవాల పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్

సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: గురువారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో ఈనెల 16 నుంచి ఫిబ్రవరి 15వ తేదీ వరకు రవాణాశాఖ నిర్వహించనున్న 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల కరపత్రాలు, గోడపత్రికలు, బ్యానర్లను జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ గురువారం ఆవిష్కరించారు. హెల్మెట్ ధారణపై వాహనదారులకు విస్తృతంగా అవగాహనా కార్యక్రమాలను చేపట్టాలని కలెక్టర్ ఉప రవాణా కమిషనర్, పోలీస్ అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమ నిర్వహణపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలలో ద్విచక్ర వాహనదారులు అధిక శాతం బలౌవుతున్నారని, హెల్మెట్ లేకపోవడంతో వారి ప్రాణాలను కాపాడుకోలేకపోయారని అన్నారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించడం ద్వారా అనుకోని సందర్భాలలో ప్రమాదాలు జరిగినా వారి ప్రాణాలను కాపాడుకోగలరని తెలిపారు. హెల్మెట్ ధారణపై అన్ని ప్రభుత్వశాఖల జిల్లా అధికారులకు తగు ఆదేశాలు ఇవ్వడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు కూడా ఈ విషయంపై అవగాహన పెంచాలన్నారు. ప్రధానంగా యువత అధిక వేగంతో ప్రయాణించి వారి ప్రాణాలకు ముప్పు తెచ్చుకుంటున్నారని, తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించాలన్నారు. దీనితో పాటు కళాశాలలో ప్రిన్సిపల్స్ కూడా విద్యార్థులు ఖచ్చితంగా హెల్మెట్ ధరించి వాహనం నడిపేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వారికి అవగాహన కల్పించాలన్నారు. భద్రతా మాసోత్సవాలలో భాగంగా హెల్మెట్ ధారణపై మారథాన్, వాకథాన్, వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహణ చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులను, అన్ని శాఖల అధికారులను, స్వచ్ఛంధ సంస్థలను, ప్రజలను భాగస్వామ్యం చేయాలని కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. అడిషనల్ ఎస్పి రాజశేఖర్ బాబు, డిటిసి నిరంజన్ రెడ్డి, డిఎం అండ్ హెచ్ఓ సుధారాణి, డిసిహెచ్ఎస్ డాక్టర్ ప్రభావతి, అధికారులు పాల్గొన్నారు.

పకడ్బందీగా వ్యాధి నిరోధక టీకాలు

ఎన్‌సిడి-సిడి స్క్రీనింగ్ సర్వేను పక్కాగా నిర్వహించండి: కలెక్టర్

వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంపై మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. గురువారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో కలెక్టర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, మెడికల్ ఆఫీసర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. క్షేత్ర స్థాయిలో పిల్లలకు వేసే వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని, ఇంకా టీకాలు వేసుకోని పిల్లల జాబితాను డాక్టర్లు సిద్ధం చేయాలన్నారు. ఏఎన్ఎంలు నిర్వహించే రిజిస్టర్లను తనిఖీ చేసి ర్యాండమ్‌గా పిల్లల తల్లిదండ్రులతో వ్యాక్సినేషన్ విషయమై మాట్లాడి నిర్ధారించుకోవాలని అన్నారు. వ్యాక్సినేషన్ చేయాల్సిన పిల్లలందరికీ తప్పనిసరిగా టీకాలు వేసేలా మెడికల్ ఆఫీసర్లు పర్యవేక్షణ ఉండాలన్నారు. గర్భిణీ స్త్రీలలో రక్త హీనత ఉన్న మహిళలను గుర్తించి దీని నివారణకు తగిన విధంగా వారు తీసుకోవాల్సిన పోషకాహారం, వైద్య సలహాలను, సేవలను అందివ్వాలన్నారు. బరువు తక్కువ గల పిల్లలు, ఎదుగుదల లేని పిల్లల జాబితాను సిద్ధం చేసి ఐసిడిఎస్ శాఖతో సమన్వయం చేసుకొని ఈ పిల్లలకు అందించాల్సిన వైద్యసేవలను సకాలంలో అందించి పోషకాహార ప్రాధాన్యతను వారి తల్లిదండ్రులకు తెలియజేయాలని అన్నారు. ప్రతి పిహెచ్‌సిలో క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి, వ్యాధి నిర్ధారణ అయిన వారికి వైద్యసేవలు అందేలా ఏఎన్ఎంలు, ఆశాలు వారి ఆరోగ్య స్థితిగతులను ఎప్పటికప్పుడు పరిశీలించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఎన్‌సిడి-సిడి స్క్రీనింగ్ సర్వే పకడ్బందీగా నిర్వహించాలని, ఈ సర్వే ప్రక్రియలో ఎదురయ్యే సమస్యలను ఉన్నతాధికారులకు తెలియజేయాలని అన్నారు. జననీ సురక్షా యోజన, ప్రధానమంత్రి మాతత్వ వందనలలో పెండింగ్ కేసుల జాబితాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధారాణి, ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకట ప్రసాద్, డిఐఓ డాక్టర్ హనుమంతరావు, హాస్పిటల్స్ సూపరింటెండెంట్లు, మెడికల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

పటిష్టంగా పిసిపిఎన్‌డిటి చట్టం అమలు

డిఎం అండ్ హెచ్ఓ సుధారాణి

సమావేశంలో మాట్లాడుతున్న డిఎం అండ్‌హెచ్ఓ డాక్టర్ సుధారాణి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

పిసిపిఎన్‌డిటి చట్టం పటిష్టంగా అమలు చేయనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిని డాక్టర్ సుధారాణి తెలిపారు. గురువారం జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో డాక్టర్ సుధారాణి ఆధ్వర్యంలో చిత్తూరు జిల్లా లీగల్ సెల్ అథారిటీ సీనియర్ జడ్జి భారతి అధ్యక్షతన పిసిపిఎన్‌డిటి చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డిఎం అండ్‌హెచ్ఓ మాట్లాడుతూ జిల్లాలో ప్రతి వెయ్యి మంది మగ శిశువులకు 892 మంది ఆడ శిశువులు ఉన్నారని జిల్లాలో పిసిపిఎన్‌డిటి చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, న్యాయశాఖ, పోలీసు శాఖ, స్త్రీశిశు సంక్షేమ శాఖ, వైద్యఆరోగ్య శాఖలు సమన్వయంలో పనిచేయాలని కోరారు. చట్టవిరుద్ధమైన కార్యకలాపాలైన లింగ నిర్ధారణ పరీక్షలు, భ్రూణహత్యలకు పాల్పడిన వారిపై చట్టపరమైన, న్యాయపరమైన శిక్షలు అమలు చేయాలని ఆదేశించారు. అలాగే వైద్య ఆరోగ్యశాఖ, పోలీసు, విజిలెన్స్ శాఖ వారు నిత్యం గర్భస్థ పిండ లింగ నిర్ధారణకు పాల్పడతున్నవారిపై నిఘా ఉంచాలన్నారు. క్షేత్రస్థాయిలో పిసిపిఎన్‌డిటి చట్టంపై అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టి ప్రజలకు చట్టంలోని శిక్షలు, జరిమానాల గురించి తెలియజేయాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా స్థాయి బృందాల దాకవనా డివిజినల్ స్థాయి బృందాల ద్వారా నెలకు 20 తనిఖీలు, 20 డెకాయి ఆపరేషన్లు తప్పక చేయాలని కమిటీ సభ్యులు నిర్ణయించినట్లు తెలపారు. ఉప వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకట ప్రసాద్, పిసిపిఎన్‌డిటి నోడల్ అధికారి డాక్టర్ హనుమంతరావు, డాక్టర్ ఉషశ్రీ, డాక్టర్ చంద్రమ్మ, ఐసిడిఎస్‌పిడి హైమావతి, అర్బన్ పిహెచ్‌సి డాక్టర్లు, సూపర్వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశాలు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలి

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి ఓబుల్‌రాజు

ప్రజాశక్తి- పలమనేరు

నెలరోజులపాటు ప్రభుత్వం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి హంగేరి ఓబులరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు శివకుమార్ అధ్యక్షతన పలమనేరులో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో భూసమస్యలు తీవ్రంగా ఉన్నాయని, వాటిని పరిష్కరించటానికి రెవెన్యూ సదస్సులు నిర్వహించింది కానీ వాటి నిర్వహణ తీరు చూస్తే ఆ లక్ష్యం నెరవేరేలా లేదని అన్నారు. గత ప్రభుత్వతీరుకు భిన్నంగా ఏమీ ఈ ప్రభుత్వం వ్యవహరించడం లేదనే భావన ప్రజల్లో వస్తున్నదని అన్నారు. రీసర్వే పేరుతో గత ప్రభుత్వం భూ యజమానులకు కంటి మీద కునుకు లేకుండా చేసింది ఇలాంటి వారందరికీ న్యాయం చేసి తన నిజాయితీ నిలుపుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలో భూసమస్యలు పరిష్కారానికి అసైన్మెంట్ కమిటీల వంటి ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి తద్వారా తక్షణ శాశ్వత పరిష్కారం చూపాలని సూచించారు. సమావేశంలో నాయకులు బాలు, వెంకటేష్, సుధాకర్, పాకాల సుబ్రమణ్యం, ఈశ్వర్, కృష్ణారెడ్డి, అజయ్ కుమార్ పాల్గొన్నారు.

రీ సర్వే గ్రామాన్ని పరిశీలించిన జెసి



గ్రామాన్ని పరిశీలిస్తున్న జెసి విద్యాధరి

ప్రజాశక్తి- గుడిపాల: మండలంలో రీ సర్వే జరిగే గ్రామాన్ని జాయింట్ కలెక్టర్ విద్యాధరి గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా జెసి మాట్లాడుతూ మండలంలో శ్రీరంగంపల్లి రెవెన్యూ గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద రీ సర్వే చేస్తున్నట్లు తెలిపారు. భూ తగాదాలను పరిష్కరించడానికే రీ సర్వే కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. రీ సర్వే జరిగేటప్పుడు రైతులందరూ తమకు సంబంధించిన పత్రాలను సమర్పిస్తే పరిశీలించి సమస్యను పరిష్కరిస్తారన్నారు. తహశీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, మండల సర్వేయర్, వీఆర్వోలు పాల్గొన్నారు.

అన్నదాతల అలుపెరగని పోరాటం

11వ రోజూ దీక్ష

ప్రజాశక్తి- కుప్పం రూరల్: కుప్పం మండలం వానగుట్టపల్లి, వి.మిట్టపల్లి పంచాయతీల అన్నదాతల అలుపెరుగని పోరాటం గురువారం 11వ రోజుకు చేరింది. పొద్దు పొడవగానే చద్ది మూట కట్టుకుని, పార చేతపట్టి పంట పొలాలకు వెళ్లాల్సిన రైతన్నలు గత 11 రోజులుగా పార పట్టవలసిన చేతిలో ప్లే కార్డు పట్టి దీక్షా శిబిరానికి చేరుకుంటున్నారు. రెక్కాడితే కానీ డొక్కాడని బడుగు, బలహీన వర్గాలకు చెందిన రైతన్నల నిరసన చూసైనా అధికారులు స్పందించకపోవడం పై స్థానికులు ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తున్నారు. దుక్కిదున్ని నార నాటి, పంట పండించి మానవాళికి తిండి గింజలను అందించే అన్నదాతల ఆవేదనను చూస్తున్న సామాజిక కార్యకర్తలు, విద్యావేత్తలు వెంటనే అన్నదాతల ఆందోళనను అర్థం చేసుకొని అధికారులు తగు చర్యలు చేపట్టాలని సూచిస్తున్నారు. వీలైనంత త్వరగా సమస్యకు పరిష్కారం చూపని ఎడల అన్నదాతల ఆగ్రహం కట్టలు తెంచుకుంటే సమాజానికి మంచిది కాదని, దేశానికి అన్నం పెట్టే అన్నదాత తాను పండించే తిండి గింజలను రక్షించుకోవడానికి రోడ్డు ఎక్కాల్సిన పరిస్థితి రావడం దౌర్భాగ్యం అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత 11 రోజులుగా నిరసన కార్యక్రమాలు తెలియజేస్తున్న ఏ ఒక్క ప్రభుత్వ అధికారి పట్టించుకోకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ, సభ పోరాటాన్ని విస్తృతం చేస్తామని హెచ్చరిస్తున్నారు.

దీక్షా శిబిరంలో అన్నదాతలు

ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు ఎంఎల్‌ఏ గురజాల జగన్‌మోహన్ జన్మదిన వేడుకలు న్యూట్రిన్ ఫ్యాక్టరీ ఆవరణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉచిత వైద్యశిబిరం, ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించగా తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు గురజాల యువత స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఎమ్మెల్యే జన్మదినం పురస్కరించుకొని పేదలకు తోపుడుబండ్లు, ఆటో రిక్షాలు, సైకిల్స్‌ను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తకు జన్మనించిన ప్రాంతానికి మేలు చేయాలనే ఉద్దేశంతో రాజకీయాల్లోకి వచ్చిన తనను ఆదరించిన చిత్తూరు ప్రజలకు ఎప్పటికీ రుణపడి ఉంటానని, చిత్తూరు నియోజవర్గ అభివృద్ధి కోసం కృషి చేస్తానని తెలిపారు. పూతలపట్టు ఎంఎల్‌ఏ మురళీమోహన్, టిడిపి జిల్లా అధ్యక్షులు సిఆర్ రాజన్, దొరబాబు, వసంత్‌కుమార్, గీర్వాణి చంద్రప్రకాష్, కఠారి హేమలత, కాజూరు బాలాజీ, నగర మేయర్ అముద, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

పుట్టిన రోజు వేడుకల్లో గురజాల జగన్‌మోహన్

జోరుగా జల్లికట్టు

వెదురుకుప్పంలో..

ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండలంలోని బ్రాహ్మణ పల్లెలో గురువారం జల్లికట్టును నిర్వహించారు. ఆ గ్రామంలో నడివీధిలో ఈ పశువుల పండగను నిర్వహించారు. ఆ గ్రామంలో గ్రామ పెద్దలు అందరూ కలిసి అల్లీనీ ఏర్పాటు చేశారు. అల్లీ అవతల నుంచి ఈ పశువులను యువకులు నిలువరించి వాటి కొమ్ములకు కట్టిన పట్టీళ్ళను (బహుమతులు) చేజిక్కించుకోవచ్చు. మొదట పశువులను వదిలి వెనుక వైపు నుంచి డప్పు శబ్దం చేస్తూ యువత ఒక జట్టుగా ఏర్పడి పశువులను నిలువరించే ప్రయత్నం చేస్తారు. పశువులను అల్లీలో నిలవరించి బహుమతి చేజిక్కించుకున్న యువకులు ఉత్సాహంతో ఆ పట్టీలను అందరికీ చూపిస్తారు. ఈ వేడకల్లో ఎవ్వరికి ఎలాంటి గాయాలు కాలేదని గ్రామపెద్దలు తెలిపారు.

ఎస్ఆర్ పురం: మండలంలో వాడవాడలా పశువుల పండుగను ఘనంగా నిర్వహించారు. గ్రామాలలో పశువులకు పూజలు చేసి భక్తిశ్రద్ధలతో కొలిచారు. అందులో భాగంగా సాంప్రదాయబద్దంగా నిర్వహించే ఊరేగింపును కొత్తపల్లిలో యువత ఆధ్వర్యంలో ఉత్సాహంగా ప్రారంభించారు. డప్పులు వాయిద్యాలు మధ్య గ్రామ వీధుల్లో పశువులు ఊరేగింపు నిర్వహించారు. కొన్ని గ్రామాల్లో కాటమరాజుకు పూజలు చేసి పశువులను అడవిలో కాటమరాజు ఆలయాల చుట్టూ ప్రదక్షణలు చేయించారు.

ఎస్ఆర్ పురంలో..

వాగు కాదండోయ్..!

- చెరువును తలపిస్తున్న రహదారి
- అదుపుతప్పి కింద పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని రోడ్డు రవాణా సంస్థ అధికారులు



రోడ్డు దాటుకునేటందుకు ఇబ్బంది పడుతున్న ఆర్టీసీ బస్సు

ప్రజాశక్తి - వెదురుకుప్పం : గత సంవత్సరం డిసెంబర్ నెలలో కురిసిన వానలకు మండలంలోని చాలా వరకు రోడ్లు పాడైపోయాయి. గంగాధర నెల్లూరు నియోజకవర్గం పరిధిలో పాతగుంట పంచాయతీ పరిధిలో మొట్టిరెడ్డి కండ్రిగ దగ్గర రోడ్డు అయితే మరీ అధ్వానంగా తయారైంది. చిన్నపాటి వాన కురిసినా రోడ్డు వాగును తలపిస్తోంది. గతంలో కురిసని వానలకు రోడ్డు మధ్యలో కోతకు గురై ఓ గుంతలా ఏర్పడింది. అప్పటి నుంచి చిన్నపాటి వాన కురిసినా నీరు నిలిచి వాగులా మారుతోంది. దీంతో వాహనదారులు రోడ్డు దాటాలంటే అవస్థలు తప్పడం లేదు. మరీ ద్విచక్రవాహనదారులు అయితే తరచూ అదుపు తప్పి కింద పడి గాయాలపాలవుతూనే ఉన్నారు. భారీ వాహనాలు సైతం ఆగి దారిని చూసుకుని జాగ్రత్తగా రోడ్డు దాటాల్సిందే..ఈ దహదారి తిరుపతి వయా పచ్చికాపల్లం, పాతగుంట మీదుగా పెనుమూరు, చిత్తూరుకి వెళ్లే ప్రధాన మార్గాల్లో ఒకటి. నిత్యం వేలాది మంది కార్లు, ఆర్టీసీ బస్సులు, ద్విచక్రవాహనాల్లో ప్రయాణిస్తూనే ఉంటారు. కార్లు నిడిపి వారు తరచూ గోతిలో కారు వెనుక భాగం ఇరుక్కునిపోయి ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. ఈ రోడ్డు మార్గం అధ్వానంగా ఉందని, రోడ్డుకు మరమ్మతులు చేపట్టాని పలుమార్లు స్థానికులు అధికారులు, ప్రజా ప్రతినిధులను కోరినా వారు పట్టించుకున్న పాపానపోలేదు.

వాహనదారులు పడూతూనే ఉంటారు..

- లక్ష్మీ, స్థానికురాలు

మొట్టిరెడ్డి కండ్రిగ దారి పల్లం ప్రదేశం. దీంతో వర్షం పడితే నీరు ఈ వైపే ప్రవహిస్తాయి. దానికి తోడు రోడ్డు మధ్యలో కోసుకుపోయి గుంత ఏర్పడటంతో ఆనీరు అక్కడే నిలిచిపోతుంది. రోడ్డుపై వేగంగా వచ్చే వాహనదారులు ఇక్కడి రాగానే ఉన్నట్లుండి బ్రేక్ వేయడంతో రోజూ ఇద్దరు ముగ్గురు పడి గాయాలపాలై వెళ్తుంటారు. ఈ సమస్యను పట్టించుకోవల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. ఇకనైనా రోడ్డుకు మరమ్మత్తులు చేపట్టండి.

రోడ్డు దాటాలంటే ఇబ్బందే..

- మంగమ్మ, మొట్టిరెడ్డి కండ్రిగ



మా పంట పొలాలకు వెళ్లాలంటే ఇదే మార్గం. ఈ రోడ్డును దాటుకుని వెళ్ళాలంటే చాలా ఇబ్బందిగా ఉంది. రాళ్లు తేలిపోయాయి. ఎలా దాటుకోవాలో అర్థం కాదు. నీళ్లు ఈ రోడ్డు ద్వారానే ప్రవహిస్తున్నాయి. ఎంత జాగ్రత్తగా ఉన్నా వాహనాలు అదుపు తప్పి పడుతూనే ఉన్నారు. ఇకనైనా ఈ దారిని బాగు చేయండి.

జాతీయ స్థాయిలో ప్రతిభ చూపిన బాడీ బిల్డర్

ప్రజాశక్తి- విజయపురం (నగరి): బాడీ బిల్డింగ్ గేమ్స్‌లో జాతీయ స్థాయిలో ప్రతిభ కనభరచిన విజయపురం మండలం మాధవరంకు చెందిన క్రీడాకారుడు తోటి వెంకటేశ్‌ను మాజీ మంత్రి, వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్కే రోజా అభినందించారు. మధ్యప్రదేశ్ ఇండోర్లో ఎంపీ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ నిర్వహించిన మిస్టర్ ఇండియా జాతీయ బాడీ బిల్డింగ్, మెన్ ఫిజిక్ చాంపియన్‌షిప్ 60 కేజీల జూనియర్ విభాగంలో కేజీ హైడ్రోలిక్ జిమ్ కోచ్ అయిన తోటి వెంకటేష్ జాతీయ స్థాయిలో ద్వితీయ స్థానం సాధించాడు. దీంతో ఏషియన్ బాడీ బిల్డింగ్ గేమ్స్ ఏపీ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ప్రకటించింది. ఈ పోటీలకుగాను రానున్న మే నెలలో థాయ్‌లాండ్‌లో నిర్వహించే ఏషియన్ బాడీ బిల్డింగ్ పోటీలకు హాజరు కానున్నాడు. ఈ సందర్భంగా గురువారం మాజీ మంత్రి ఆర్కేరోజాను ఆమె నివాస కార్యాలయంలో కలిసి ఆమె చేతులమీదుగా మెడల్, ట్రోఫీని అందుకున్నాడు. వెంకటేశ్‌ను మాజీ మంత్రి సత్కరించి అభినందించారు. భవిష్యత్తులో అతను పాల్గొనే పోటీలకు సహాయ సహకారాలు అందిస్తానన్నారు.

మానవ హక్కుల

కౌన్సిల్ అధ్యక్షులుగా వరదరాజులు

ప్రజాశక్తి- యాదమరి: జాతీయ మానవ హక్కుల కౌన్సిల్ యాదమరి మండల అధ్యక్షులుగా పి.వరదరాజులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా వరదరాజులు మాట్లాడుతూ తనను ఎంపిక కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన భాద్యతను శక్తివంచన లేకుండా నిర్వహిస్తానని తెలిపారు.

ఎక్సైజ్ పోలీసుల 'ఇంటింటికీ సర్వే'

ప్రజాశక్తి - గుడిపాల: మండలంలోని రాసనపల్లి గ్రామంలో ఎక్సైజ్ పోలీసులు ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే నిర్వహించినట్లు చిత్తూరు అర్బన్ ఎక్సైజ్ సీఐ శ్రీహరి రెడ్డి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సారా రహిత గ్రామాలుగా మార్చాలనే లక్ష్యంతో నవోదయం 2.0 కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. గ్రామాలలో నాటు సారా తయారీ, విక్రయాలకు దూరంగా ఉండాలనే లక్ష్యంతోనే ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. అందులో భాగంగానే రాసనపల్లిలో ప్రతి ఇంటికి వెళ్లి సర్వే చేసి ఆధార్, రేషన్ కార్డు సేకరిస్తున్నట్లు తెలిపారు. ఈ సర్వే నిర్వహించి వారికి ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

విజేతలకు బహుమతులు ప్రదానం

బహుమతులు అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి- వెదురుకుప్పం: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని టిడిపి జిల్లా మాజీ కార్యదర్శి వెదురుకుప్పం క్లస్టర్ ఇంచార్జి మోహన్ మురళి అన్నారు. గురువారం కురివికుప్పం యూత్ ఆధ్వర్యంలో సంక్రాంతి క్రికెట్, వాలీబాల్, చెస్ పోటీలు నిర్వహించి విన్నర్స్, రన్నర్లకు బహుమతులు అందజేశారు. మండల పార్టీ అధ్యక్షులు లోహనాథరెడ్డి, క్లస్టర్ ఇంచార్జి మాజీ ఎంపిటీసీ మోహన్ మురళి, ప్రధాన కార్యదర్శి నరసింహ యాదవ్, నాథమునిరెడ్డి, సర్పంచ్ అబులరెడ్డి, చిరంజీవి రాయల్, గిరిధర్‌రెడ్డి, రామచంద్రయ్య శెట్టి పాల్గొన్నారు.

ఇస్రో విజయంపై శ్రీసిటీ ఎండీ అభినందనలు

ప్రజాశక్తి - వరదయ్యపాలెం: గురువారం స్పేస్ డాకింగ్ ప్రయోగం (స్పేడెక్స్) విజయవంతం కావడంపై ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్‌కు, ఇస్రో బృందానికి శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ప్రత్యేక అభినందనలు తెలిపారు. అంతరిక్షంలో ఉపగ్రహాల అనుసంధానం (డాకింగ్) చేయగల సత్తా కలిగిన 4వ దేశంగా భారతదేశాన్ని నిలిపిందని, ఈ విజయాన్ని అందించిన ఇస్రో బృందం కృషి అంకితభావాన్ని కొనియాడారు. ఇస్రో కొత్త ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్. నారాయణన్‌కు అభినందనలు తెలిపారు. డాక్టర్ నారాయణన్ నాయకత్వంలోని ఈ మైలురాయి భవిష్యత్తులో మానవ అంతరిక్షయాన మిషన్‌లకు గట్టి పునాది వేస్తుందన్నారు. ఇస్రో అంకితభావాన్ని ప్రశంసిస్తూ, విజయ పరంపర నిరంతరం కొనసాగాలంటూ శుభాకాంక్షలు తెలియజేశారు.

20 నుంచి ఫిబ్రవరి 2 వరకు

కుష్టు నిర్మూలనా సర్వే

జాతీయ కుష్టు నిర్మూలనా సర్వే పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఈనెల 20వ తేదీ నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు జాతీయ కుష్టు నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా ఇంటింటి సర్వే నిర్వహణను పక్కాగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం జిల్లా సచివాలయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించి జాతీయ కుష్టు నిర్మూలనా కార్యక్రమ ఇంటింటి సర్వే (లెప్రసీకేస్ డిటెక్షన్ క్యాంపెయిన్) గోడపత్రికలను, బ్యానర్లను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కుష్టువ్యాధిని పూర్తిగా నిర్మూలించే కార్యక్రమంలో భాగంగా ప్రారంభ దశలోనే దీనిని గుర్తించి సరైన వైద్య చికిత్స అందించడం ద్వారా కుష్టు వ్యాధి వ్యాప్తి చెందకుండా ఉంటుందని అందుకు అనుగుణంగా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పనిచేయాలన్నారు. ఇందుకు ప్రభుత్వం చేపట్టిన జాతీయ కుష్టు నిర్మూలనా కార్యక్రమ ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని (ఈనెల 20వ తేదీ నుంచి ఫిబ్రవరి 2వ తారీఖు వరకు) పకడ్బందీగా క్షేత్రస్థాయిలో నిర్వహించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ వ్యాధికి సంబంధించిన లక్షణాలు, చికిత్స, నివారణ చర్యలపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. స్వయం సహాయక సంఘ మహిళలకు అవగాహన కల్పించాలని, ప్రతి పాఠశాలలో ప్రతి విద్యార్థిని తనిఖీ చేసి ఈ వ్యాధికి సంబంధించిన లక్షణాలను ఉంటే గుర్తించాలన్నారు. ఈ వ్యాధిని ముందుగా గుర్తించడం ద్వారా అంగవైకల్యాన్ని నివారించవచ్చునని, ఈ వ్యాధిని ఎండిటి చికిత్సతో పూర్తిగా నయం చేయవచ్చునని సూచించారు. జిల్లాలోని ప్రతి ఇంటిని సర్వే చేసి వ్యాధి ఉన్నవారిని గుర్తించాలన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ జి విద్యాధరి, అసిస్టెంట్ కలెక్టర్ హిమ వంశీ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధారాణి, ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటప్రసాద్, డాక్టర్ హనుమంతరావు పాల్గొన్నారు.

ముగ్గులపోటీలు

ముగ్గులను పరిశీలిస్తున్న నాయకులు

ప్రజాశక్తి- కుప్పం రూరల్: మండలంలోని చెక్కునత్తం పంచాయతీ అడవి ములకలపల్లి గ్రామంలో మహిళలకు ముగ్గులపోటీలు నిర్వహించారు. తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెక్కునత్తం మణి ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలకు న్యాయనిర్ణయతగా వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ మాజీ అధ్యక్షులు సత్యేంద్ర శేఖర్ వ్యవహరించారు. ఈ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి అధ్యక్షులు మునిరత్నం పాల్గొన్నారు.

మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలి

తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ప్రజాశక్తి-పలమనేరు: మండలంలోని ముసలిమడుగు గ్రామానికి చెందిన శివకుమార్, షమీర్ చేతిలో దారుణ హత్యకు గురి అయిన విషయం పాఠకులకు విధితమే. మృతుడు ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి అని, అతని కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని కోరుతూ ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు డివి.మునిరత్నం, ఎల్.సుబ్రహ్మణ్యం, శివాడి గోవిందు, డి.ప్రమీళ, కత్తి శ్రీనివాసులు, మురళి, టి.మణిలు కోరారు. గురువారం తహశీల్దార్ ఇన్బునాథన్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మృతుని కుటుంబానికి కోటి రూపాయలు పరిహారం, పట్టణంలో ఇంటి స్థలం, జీవనోపాధి కోసం ఐదు ఎకరాలు వ్యవసాయ భూమి, ఇద్దరు పిల్లలను గురుకుల పాఠశాలలో డిగ్రీ వరకు ఉచిత విద్య అందించాలని కోరారు.

కార్యకర్త మృతికి ఆర్థిక సాయం



ప్రజాశక్తి - రామకుప్పం: మండలంలోని ఉన్సిగానిపల్లి పంచాయతీ ఆనిగానూరు గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త వెంకటాచారి గురువారం అనారోగ్యంతో మృతిచెందాడు. టిడిపి నేతలు ఆయన భౌతికాయానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలతో రూ.10వేలు వారి కుటుంబ సభ్యులకు మట్టి ఖర్చులకు గాను అందజేశారు. కూటమి ప్రభుత్వంలో నిరుపేదలకు ఎల్లప్పుడూ అండగా ఉండి సహాయ సహకారాలు అందించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర నేత మునస్వామి, మాజీ సర్పంచులు రామ్మూర్తి, జయశంకర్, కృష్ణారెడ్డి, మహేంద్ర నాయుడు, మనీష్, షణ్ముగం, వెంకట్రామయ్య గౌడు, బీరప్ప, మంజు పాల్గొన్నారు.

వైభవంగా గిరిప్రదక్షిణ ఉత్సవాలు

ప్రజాశక్తి విజయపురం (నగరి): ప్రతిఏడు కనుమ పండుగకు మరునాడు ముక్కనుమ రోజున నిర్వహించే కొండచుట్టు ఉత్సవాలు ఈ ఏడాది కూడా వైభవంగా జరిగింది. ఉత్సవాలకు కేంద్రమైన కొండచుట్టు మండపం వద్ద గురువారం వేకువజాము నుంచే తిరనాళ్ల సందడి నెలకొంది. మండపం పరిసరాల్లో తినుబండారాలు, బొమ్మలు, గాజులు, చెరకు గడలు, అలంకరణ వస్తువుల విక్రయాలు జోరుగా సాగాయి. రోడ్డుకు ఇరువైపులా సుదూర ప్రాంతం వరకు దుకాణాలు వెలిసాయి. సాయంత్రం 4 గంటల నుంచి ప్రజలు కొండచుట్టు మండపం వైపునకు నడక సాగించడంలో కొండచుట్టుకు వెళ్లే మార్గంలో రద్దీ ఏర్పడింది. కొండ చుట్టు మండపం నుంచి సుమారు కిలోమీటరు మేర జనసందోహం కనిపించింది. ఆనవాయితీ ప్రకారం ఉత్సవాలకు విచ్చేసే దేవతామూర్తులు నారాయణవనం అగస్త్యేశ్వర స్వామి, పరాశురేశ్వరస్వామి, బుగ్గ కాశీవిశ్వేశ్వర స్వామి, పాళమంగళం నుండి పాళేశ్వర స్వామి, ముడిపల్లి అగస్త్యేశ్వర స్వామి, రాధారుక్మిణి స్వాములు, కరింబేడు నాధాళీశ్వర స్వామి, మేళంబాకం రాధాకృష్ణస్వామి, మిట్టపాళెం పాళేశ్వరస్వామి అలాగే దేశూరు అగరం నుండి వేణుగోపాలస్వామి, కృష్ణారాపురం గ్రామం నుండి శివపార్వతులు, తెరణి వైకుంఠనాథ స్వామి, సత్రవాడ చిదంబరేశ్వర స్వామి శివగామి సుందరి, చింతలపట్టెడ శరవణవినాయక, అగరవినాయక స్వాములు, మేళపట్టు పరమేశ్వరుడు, ఎలకాటూరు కృష్ణమూర్తి స్వామి, చవరంబాకం పరమేశ్వరస్వామి, కళియంబాకం కాళేశ్వర స్వామి, జ్ఞానమ్మ పట్టెడ నుంచి మీనాక్షి దేవి, మూలనెత్తం గ్రామం నుంచి ఈశ్వరుడు, వినాయకులను నగరి కరకంఠేశ్వర స్వామి స్వాగతం పలుకగా అందమైన ప్రభలతో అలంకారపూరితమై విచ్చేసిన దేవతామూర్తులు మండపం ఆవరణలోని మైదానంలో చేరగా భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి దర్శించుకున్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు డీఎస్పీ సాయినాథ్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటుచేశారు. ముగ్గురు సీఐలు, ఎస్ఐలు, పోలీసులు 50 మంది భద్రతా చర్యల్లో పాల్గొన్నారు. మాజీ మంత్రి ఆర్కేరోజా పార్టీ శ్రేణులతో కలిసి హాజరై మండలంలోని వినాయకుని, ఊరేగింపుగా విచ్చేసిన దేవతలను దర్శించుకున్నారు.

కట్టడాలపై నిర్లక్ష్యం.. పిచ్చిమొక్కలే సాక్ష్యం..!

అంజూరు మండపానికి భద్రత కరువు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థాన అధికార యంత్రాంగం ఏ పని చేసినా..ఏ నిర్ణయం తీసుకున్నా వింత అనేది మాత్రం ఖచ్చితం. 'ఎవరేమనుకున్నా తమకు ఎందుకులే అనే నిర్లక్ష్యమో లేక 'నవ్విపోదురు గాక మాకేటి సిగ్గు తిట్టి పోదురు గాక మాకేటి ఎగ్గు' అనే ధోరణో తెలియదు. సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా పశువుల పండుగ సందర్భంగా బుధవారం దేవస్థానం ఆధ్వర్యంలో గిరి ప్రదక్షిణం ఉత్సవం వేడుకగా, ఆర్భాటంగా నిర్వహించారు. చలువ పందిళ్లు, షామియానాలు, అన్నదాన కార్యక్రమాలు, ప్రసాదాలు పంపిణీ అన్నీ జరిగాయి. భక్తులు కూడా సంతోషించారు. అయితే ప్రధాన విడిది మండపం అయిన అంజూరు మండపాన్ని గురించి మాత్రం పట్టించుకోవడం మానేశారు.

అంజూరు మండపానికి భద్రత కరువు

తిరుపతి నగరానికి మంచినీటిని సరఫరా చేసే కైలాసగిరి రిజర్వాయర్ నిర్మాణం సందర్భంగా మునక ప్రాంతంలో ఉండిన అంజూరు మండపాన్ని కొండకు పక్కగా ఎగువ ప్రాంతంలో నిర్మాణం చేశారు. నిర్మాణ లోపమో..!లేక నిర్వహణా లోపమో తెలియదు గానీ వర్షం వస్తే నీళ్లన్నీ లోపలే పడతాయి. అంతేగాకుండా మండపంపై రావి, మర్రి లాంటి వివిధ రకాల మొక్కలు ఏపుగా పెరిగాయి. గిరి ప్రదక్షిణం కోసం రూ. లక్షలు ఖర్చు చేసిన దేవస్థానం అధికారులు, సిబ్బంది మండపం వైపు మాత్రం కన్నెత్తి చూడలేదు అనడానికి పెరుగుతున్న మొక్కలే సజీవ సాక్ష్యం. అసలే శిథిలావస్థలో ఉన్న మండపంపై మొక్కల పెరుగుతున్న నేపథ్యంలో నిర్మాణం మరింతగా దెబ్బతినే ప్రమాదం ఏర్పడింది. హరితాభివృద్ధి, నందన వనం సిబ్బందిని ఆలయంలో సర్దుబాటు చేసి వారికి అవసరమైన, అనుకూలమైన సీట్లలో కూర్చోబెట్టి జీతాలు చెల్లిస్తున్న దేవస్థానం అధికారులు అటు అడవిని, ఇటు కొండను గాలికి వదిలేశారు. ఉన్న ఒకే ఒక పురాతనమైన అంజూరు మండపాన్ని సంరక్షించడానికి జాగ్రత్తలు తీసుకోవడం లేదు. భోగి పండుగ సందర్భంగా సమీప గ్రామాల ప్రజలు ఏపుగా పెరిగిన చెట్లను కొట్టి ట్రాక్టర్లలో తరలించేశారు. ఆలయానికి సమీపంలోని లో బావిలో శ్రీగంధం చెట్టును శుభ్రంగా నరికి తీసుకెళ్లినా ఇప్పటివరకు చర్యలు లేవు. విచారణ లేదు. ఆలయంలో ఎక్కడెక్కడ, ఏ విధంగా, ఎంత ఆదాయం వస్తుందో పరిశీలించి, పరిశోధించే అధికారులకు ఇవన్నీ పట్టించుకునే తీరిక ఓపిక లేనట్టుంది. ఇకనైనా శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న పురాతన కట్టడాల బాగోగులపై అధికారులు శ్రద్ధ చూపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

గోడపై ఏపుగా మొలిచిన రావిచెట్టు

కొంగల సమావేశం

ప్రజాశక్తి- బంగారుపాళ్యం : మండలంలోని బోడబండ్ల సమీపంలో గల చెరువులో ప్రజాశక్తి విలేకరి కెమెరా కంటబడ్డాయి. మొదట అవన్నీ కలిసికట్టుగా మాట్లాడుకుని అన్ని ఒకేసారి ఎగిరి ఆహారాన్ని సంపాదించి తిరిగి అదే ఒడ్డుకు చేరి ఆరగిస్తుండటం చేస్తే ఆశ్చర్యం కలుగకమానదు. కొంగలన్నీ ఒకటిగా ఉండటం చూసి పలువురు హర్షం వ్యక్తం చేశారు.

అమ్మవారి సేవలో సిఆర్ రాజన్

ప్రజాశక్తి -ఎస్ఆర్ పురం: తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు సిఆర్ రాజన్ గురువారం గంగమ్మ తల్లిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వెంకటాచలపతి, అర్చకులు జిల్లా తెలుగుదేశం నాయకులు గంధం నేని రాజశేఖర్ నాయుడు తదితరులు పూర్ణకుంభంతో సిఆర్ రాజన్నకు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందించారు. గంధమనేని రాజశేఖర్ నాయుడు, గంధమనేని నరేష్, జలంధర్ నాయుడు, జయచంద్ర నాయుడు, వెంకటరమణ, వేమన నాయుడు, హిమాచలపతి రెడ్డి, బాలు పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: మండలంలోని వి.వి.పురం గ్రామ పంచాయతీ గుడి గ్రామంలో వెలసిన శ్రీ ఆరిమాని గంగమ్మ తల్లి హుండీ ఆదాయంను గురువారం ఆలయ నిర్వహణ అధికారి తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. సంక్రాంతి సందర్భంగా భక్తులు హుండీలో వేసిన కానుకలను పాలకమండలి కమిటీ సభ్యుల సమక్షంలో లెక్కించారు. సేవా టికెట్ల ద్వారా ద్వారా వచ్చిన ఆదాయం 2,21,735 తాత్కాలిక హుండీల ద్వారా 2,42,999 శాశ్వత హుండీ 23 అక్టోబర్ 24 నుండి 16 జనవరి 25 వరకు శాశ్వత హుండీ ద్వారా 176256 మొత్తం 6,40,990 ఆదాయం వచ్చిందన్నారు. చైర్మన్ లింగారెడ్డి, వెంకట చలపతి ఆచార్యులు, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

వైద్యసేవలు సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి- యాదమరి: ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ప్రోగ్రాం సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి డాక్టర్ అనిల్ కుమార్ నాయక్ పిలుపునిచ్చారు. గురువారం యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పెరియంపాడి గ్రామంలో 104 సంచార వైద్య వాహనంతో పాటు వైద్య సిబ్బంది హాజరయ్యారు. డాక్టర్ అనిల్ కుమార్ నాయక్ మాట్లాడుతూ పేద ప్రజలకు ఎలాంటి ఖర్చు లేకుండా వారి గ్రామాల్లోనే అవసరమైన వైద్య సేవలు అందించే నిమిత్తం ప్రభుత్వం 104 సంచార వైద్యవాహనం ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం కాన్సెప్ట్ కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. ప్రతినెలా మూడవ గురువారం మీ గ్రామానికి వైద్య సిబ్బంది వచ్చి మీకు అవసరమైన మాత్రలు, మందులు ఉచితంగా అందిస్తారని ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. సిహెచ్ఓ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ 14 రకాల వైద్య పరీక్షలతో పాటు చిన్నచిన్న వ్యాధులకు చికిత్సల నిమిత్తం చేసి అవసరమైన మందులను ఉచితంగా అందిస్తామన్నారు. దీర్ఘకాలిక వ్యాధులైన చక్కెర వ్యాధి, రక్తపోటు, లాంటి వాటికి పరీక్షలు నిర్వహించి నెలకు సరిపడా మందులను ఉచితంగా అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మెయిల్ హెల్త్ వర్కర్ సురేందర్ రెడ్డి, ఏ నేమ్స్ ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

IN THE COURT OF THE PRL. SENIOR CIVIL JUDGE CHITTOOR
E. A.No.24 of 2024
O.E.P.No.29 of 2019
O. S. No. 357 of 2017 (Prl. S C J Court, Nellore)
Between;
Baddepudi Venkateswarulu (died) and others ...Decree Holder
And;
Y. Eswar babu ...Judgment debtor
NOTICE TO JUDGMENT DEBTOR
Y. Eswar Babu
S/o Markonda Naidu,
Sri Lakshmi Venkateswara Glass and play Woods, D.No. 18-385, Palamaner Road, Chittoor Town and District
Sir,
Please take notice that the above case is posted to 03.02.2025, for your notice and appearance at 10.30 am, before the above said court. You may appear either in person or through an advocate and file your objections if any, failing which the matter will be decided ex-parte.
S.Vijaya Bhaskar Rao, B. Com.LLB
Advocate for Decree Holder
Place:Chittoor, Date: 15.01.2025

IN THE COURT OF THE PRL. SENIOR CIVIL JUDGE CHITTOOR
E. A.No.25 of 2024
O.E.P.No.29 of 2019
O. S. No. 357 of 2017 (Prl. S C J Court, Nellore)
Between;
Baddepudi Venkateswarulu (died) and others ...Decree Holder
And;
Y. Eswar babu ...Judgment debtor
NOTICE TO JUDGMENT DEBTOR
Y. Eswar Babu
S/o Markonda Naidu,
Sri Lakshmi Venkateswara Glass and play Woods, D.No. 18-385, Palamaner Road, Chittoor Town and District
Sir,
Please take notice that the above case is posted to 03.02.2025, for your notice and appearance at 10.30 am, before the above said court. You may appear either in person or through an advocate and file your objections if any, failing which the matter will be decided ex-parte.
S.Vijaya Bhaskar Rao, B. Com.LLB
Advocate for Decree Holder
Place:Chittoor, Date: 15.01.2025

రారండోయ్... వేడుక చేద్దాం..!

ప్రకృతి ప్రేమికులు రావాలని పిలుపు
రేపటి నుంచే ఫ్లెమింగో ఫెస్టివల్
ఐదు చోట్ల ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష

ఫ్లెమింగో ఫెస్టివల్ ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ : ఫ్లెమింగో ఫెస్టివల్‌ను ఈనెల 18–20 తేదీల్లో ప్రకతి, సంస్కృతి, జీవవైవిధ్యాల మహోత్సవంగా వేడుకగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ చెప్పారు. ప్రకతి ప్రేమికులను ఎంతగానో ఆకట్టుకునే ఫ్లెమింగో ఫెస్టివల్ 2025 ను ప్రజలు, పర్యావరణ ప్రేమికులు సందర్శించాలని పిలుపునిచ్చారు. గురువారం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు జెసి శుభం బన్సల్, జిల్లా అటవీ కన్జర్వేటర్ అధికారి సెల్వం, ఆర్డీ టూరిజం రమణ ప్రసాద్‌తో కలిసి జిల్లా కలెక్టర్ పాత్రికేయుల సమావేశం నిర్వహించి మాట్లాడుతూ ఫ్లెమింగో ఫెస్టివల్ 2025 ఫ్లెమింగో ఫెస్టివల్‌ను ఘనంగా నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేస్తున్నామని అన్నారు. 2020 సంవత్సరం వరకు ఫ్లెమింగో ఫెస్టివల్ ప్రతి సంవత్సరం నిర్వహించి ఉన్నారని, గత నాలుగు సంవత్సరాలుగా ఈ ఫ్లెమింగో ఫెస్టివల్‌ను నిర్వహించలేదని, ప్రస్తుత ముఖ్యమంత్రి జిల్లా పర్యటనకు వచ్చినపుడు ఫ్లెమింగో ఫెస్టివల్ 2025ను ఘనంగా రాష్ట్ర పండుగ రీతిలో నిర్వహించాలని సూచించారని తెలిపారు. మన జిల్లాలో ఫ్లెమింగో ఫెస్టివల్‌ను మూడు రోజులపాటు ఐదు ప్రాంతాలలో నేలపట్టు, బి.వి పాలెం, అటకానితిప్ప, శ్రీ సిటీ, సూళ్లూరుపేట నందు ఘనంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు ఉండరాదని అధికారులకు ఆదేశించి పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. నేలపట్టు పక్షుల అభయారణ్యం నందు ఉన్న విలక్షణ, పర్యావరణ వైవిధ్యం కారణంగా గ్రేపెలికాన్ పక్షులు, కార్మోనెట్ బిల్ పక్షులు(నీటి కాకులు), స్పూన్ బిల్ స్టాక్ పక్షులు, ఓపెన్ బిల్ స్టాక్ పక్షులు తదితర అరుదైన పక్షులు నేలపట్టు అభయారణ్యానికి ఆలవాలమని తెలిపారు. వలస పక్షులు సౌత్ ఈస్ట్ ఆసియా సుదూర విదేశీ ప్రాంతాల నుండి వచ్చి వాటి సంతతిని పెంపొందించుకొని తిరిగి స్వంత ప్రాంతాలకు వెళ్తాయని, అలాగే ఫ్లెమింగో పక్షులు ఆహారం కొరకు వలస వచ్చి స్వంత ప్రాంతాలకు తిరిగి వెళ్ళిపోతాయని అన్నారు. ఈ విలక్షణ పక్షులను సందర్శించడానికి, విజ్ఞానాన్ని పెంపొందించుకొనడానికి వీలుగా నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రం నందు విలక్షణ పెలికాన్ పక్షుల వీక్షణ, అటకానితిప్ప పులికాట్ పక్షుల రక్షిత కేంద్రం వీక్షణ పాయింట్ల నందు ఫ్లెమింగో పక్షుల వీక్షణ ఏర్పాటు తగినన్ని బైనాక్యులర్లు ఏర్పాటు చేశామని, బీవీపాలెం నందు 35 బోట్లు ఏర్పాటుతో లైఫ్ జాకెట్ లైఫ్ బాయ్ ల ఏర్పాటుతో బోటింగ్ ఏర్పాటు చేశామని, కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు చేశామని, స్థానికంగా వున్న 50 మందిని గైడులుగా నియమిస్తున్నామని తెలిపారు. పర్యావరణ వైవిధ్య అంశాలపై ఎకో ఫ్రెండ్లీ బయో డైవర్సిటి అంశాలపై పలువురు నిష్ణాతులతో మేథో మథన సదస్సులు 3 రోజులు నిర్వహించి తద్వారా ఒక మంచి ప్రణాళిక తయారీకి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అలాగే సూళ్లూరుపేట పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో పలు స్టాల్ లు ఏర్పాటుతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఫ్లెమింగో ఫెస్టివల్ 2025 ను ప్రజలు, విద్యార్థిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. సుమారు 200 రకాల పైగా పక్షులు వస్తాయని, అన్ని ఏర్పాట్లు చేపడుతున్నామని అన్నారు. అటవీ శాఖ, పర్యాటక శాఖ, శ్రీసిటీ తదితర ఇన్స్టిట్యూషన్‌లు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో ఈకార్యక్రమ నిర్వహణకు చర్యలు చేపడుతున్నామని అన్నారు. సీనియర్ అధికారులకు ఈ ఐదు ప్రాంతాలకు ఇంఛార్జి బాధ్యతలు అప్పగించామని తెలిపారు. నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రానికి ఇన్చార్జి అధికారిగా గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, అటకానితిప్ప పక్షుల రక్షిత కేంద్రానికి పిడి వెలుగు శోభన్ బాబు, బీవీ పాలెం బోటింగ్ ప్రాంతానికి ఇన్చార్జిగా డిడి మత్స్య శాఖ నాగరాజు, సూళ్లూరుపేట జూనియర్ కళాశాల ప్రాంగణం నందు ఏర్పాటు చేసిన వెన్యూ ఇన్చార్జిగా పిడి డ్వామా శ్రీనివాస ప్రసాద్, శ్రీసిటీ వెన్యూ నందు స్టేట్ సిల్వికల్చరిస్ట్ నరేంద్రన్ లకు విధులు కేటాయించడం జరిగిందని, మొత్తం కార్యక్రమానికి జెసి శుభం బన్సల్ నోడల్ అధికారిగా ఉంటారని, జిల్లా ఎస్పీ, కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ కన్వీనర్ లుగా ఉంటారని ఈ కార్యక్రమం జిల్లా టూరిజం కౌన్సిల్ చైర్మన్ ఆధ్వర్యంలో జరుగుతుందని తెలిపారు. పెద్ద ఎత్తున పర్యాటకులు ఇతర రాష్ట్రాల నుండి కూడా వస్తారని అంచనా వేసి తదనుగుణంగా ఏర్పాట్లు చేపడుతున్నామని తెలిపారు. సదరు ఫ్లెమింగో ఫెస్టివల్ సాంస్కృతిక కార్యక్రమాల్లో స్థానికులకు ప్రాధాన్యత ఇవ్వనున్నామని, స్థానిక ఆహార అలవాట్ల మేరకు ఫుడ్ కోర్టు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ ప్రాంతాలు ఎకో సెన్సిటివ్ జోన్ లో ఉన్నాయని, సదరు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచడం మన బాధ్యత అని, ఈ ఫ్లెమింగో ఫెస్టివల్ కు వచ్చేవారు ప్లాస్టిక్ వాడకం లేకుండా పర్యావరణ హితమైన వాటిని వాడాలని, ఇక్కడికి వచ్చు పక్షులకు హాని జరగకుండా ఉండటానికి మనవంతు బాధ్యతను నిర్వర్తించాలని అన్నారు. అనంతరం ఫ్లెమింగో ఫెస్టివల్ వెబ్‌సైట్‌ను ప్రారంభించారు.